DYNAMIC EDITION

# వాయిస్ టుడే

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com

జనగాత్రం - మననేత్రం

Follow

పేజీలు 2

శుక్రవారం, నవంబరు 24, 2023



## కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మనోహర్ రెడ్డి సోదరుడి ఇంటిపై ఐటీ దాడులు




వికారాబాద్ నవంబర్ 24: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ వికారాబాద్ జిల్లా తాండూరులో ఐటీ దాడులు కలకలం సృష్టించాయి. యలాల మండలం జుక్కేపల్లి సమీపంలోని ఆర్‌బీఎల్ ఫ్యాక్టరీలో సోదాలు నిర్వహిస్తున్నారు. అది కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మనోహర్ రెడ్డి సోదరుడు శ్రీనివాస్ రెడ్డికి చెందినది కావడం విశేషం. ఫ్యాక్టరీతోపాటు ఆయన నివాసంలోనూ తనిఖీలు చేస్తున్నారు. ఇటీవల చెన్నూరు కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వివేక్ నివాసంతోపాటు కార్యాలయాల్లోనూ ఐటీ, ఈడీ అధికారులు సోదాలు నిర్వహించిన విషయం తెలిసిందే. వివేక్‌కు చెందిన కంపెనీ అకౌంట్‌లోని డబ్బు పెద్దమొత్తంలో ఓ సెక్యూరిటీ ఏజెన్సీ అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ అవడం, ఈడీ సూచనమేరకు బ్యాంకు అధికారులు ఆ మొత్తాన్ని సీజ్ చేశారు. అంతకుముందు హైదరాబాద్‌లోని రామంతాపూర్‌లో రూ.50 లక్షలు పట్టుబడ్డాయి.



## తెలంగాణలో కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తాం

ఖమ్మం జిల్లా మధిర కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు కొనసాగుతున్నాయి. బీఆర్ఎస్‌కు చెందిన పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. తెలంగాణలో కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తామని భట్టి విక్రమార్క ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని భట్టి విక్రమార్క అన్నారు.

## హైదరాబాద్ మెట్రోలో మంత్రి కేటీఆర్ సందడి



హైదరాబాద్ (వాయిస్ టుడే): మెట్రోలో మంత్రి కేటీఆర్ సందడి చేశారు. ఆయన ఏ హంగు ఆర్భాటం లేకుండా సాధారణ వ్యక్తిలా మెట్రోలో ప్రయాణించారు. రాయదుర్గం మెట్రో స్టేషన్ నుండి బేగంపేట మెట్రో వరకు ప్రయాణించిన మంత్రి కేటీఆర్..ప్రయాణికులతో ముచ్చటించారు. ఏ ప్రోటోకాల్ లేకుండా మెట్రో రైలులోకి ఎంట్రీ ఇచ్చిన కేటీఆర్‌ను తొలుత ప్రయాణికులు గుర్తు పట్టలేదు. తరువాత గుర్తుపట్టి ఆయనతో సెల్ఫీలు దిగడానికి ప్రయాణికులు ఎగబడ్డారు. సంయమనంతో వ్యవహరించిన మంత్రి కేటీఆర్..అందరికి ఓపికతో సెల్ఫీలిచ్చారు.



## ఈసారి గెలిస్తే.. తన హాస్పిటల్లో ఒక్క రూపాయికే వైద్యం

తనకు ఓటేసి గెలిపిస్తే.. మళ్లీ సేవ చేసుకుంటానన్నారు మంత్రి మల్లారెడ్డి. ఎన్నికల ప్రచారంలో భాగంగా కీసర మండలంలో రోడ్ షో నిర్వహించారు. ఈసారి గెలిస్తే.. తన హాస్పిటల్లో.. తన నియోజకవర్గ ప్రజలకు ఒక్క రూపాయికే ఆపరేషన్లు చేయిస్తానని హామీ ఇచ్చారు. ప్రజలు బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి ఓటెయ్యాలని కోరారు.

## దద్దమ్మ కాంగ్రెస్‌కు చేతగాక సింగరేణిని సమైక్య నేతల చేతుల్లో పెట్టారు




ఆదిలాబాద్ (వాయిస్ టుడే): దద్దమ్మ కాంగ్రెస్‌కు చేతగాక సింగరేణిని సమైక్య చేతల చేతుల్లో పెట్టారని సీఎం కేసీఆర్ విమర్శించారు. పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గంలో జరిగిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'సింగరేణి 134 ఏళ్ల కింద పుట్టిన మన సొంత కంపెనీ. నిజాం రాజు కాలంలో పుట్టిన కంపెనీ. మన సొంత ఆస్తి. ఈ కాంగ్రెస్ దద్దమ్మ నాయకులకు చేతగాక సమైక్య నాయకుల చేతిలో పెడితే కేంద్రం దగ్గర అప్పులు తెచ్చారు. రూ.600కోట్ల మారటోరియం సింగరేణి మీద ఉండేది. ఆ అప్పులు కట్టుడు చేతగాక మా వల్లకాదని చేతులెత్తేసి కేంద్రానికి 49శాతం వాటా పుట్టించారు. మన సింగరేణి వందశాతం మనకే ఉంటుండే. అలా లేకుండా చేసిందే కాంగ్రెస్' అంటూ విమర్శించారు.

### ఆంధ్రాలో కలిపిందే కాంగ్రెస్

'తెలంగాణను ఆంధ్రాలో కలిపిందే కాంగ్రెస్. గోదావరి ఒరుసుకుంటు పారే మంచిర్యాల, కరీంనగర్ జిల్లాల్లో మంచినీళ్ల గోస, కరెంటు గోస. చేనేత కార్మికుల చనిపోవుడు. రైతులు ఆత్మహత్యలు చేసుకునుడు. కరెంటు ఇస్తే తెల్లందాక ఇంత. పొద్దందాక ఇంత. ఆడ పాములు కరిచి చనిపోవుడు. విపరీతమైన బాధలు పడ్డాం. సింగరేణిలో డిపెండెంట్ ఉద్యోగాలు ఉండే. వాటిని ఊడగొట్టింది కాంగ్రెస్సే కదా? గవర్నమెంట్ కాంగ్రెస్సే. ఒప్పందాలపై సంతకాలు పెట్టి ఉన్న హక్కులను పోగొట్టారు. తెలంగాణ వచ్చిన తర్వాత దాన్ని పునరుద్ధరించుకున్నాం. అంతేకాకుండా 15వేల మందికి ఉద్యోగాలు ఇచ్చుకున్నాం. మీ కండ్ల ముందు జరిగిన చరిత్ర. అనేక కారణాలు ఉన్నయ్. కాంగ్రెస్ వాళ్లు ఉన్నప్పుడు ఇవ్వలేదు. మేం ఇస్తుంటే ఓరుస్త లేరు' అంటూ విమర్శించారు.

### కులం, మతం లేకుండా కలుపుకుపోతున్నాం..

'ఎన్నో ఏండ్ల నుంచి పరిష్కారం కానీ సమస్యలు పరిష్కారం అవుతున్నాయి. అన్ని వర్గాలను, కులం మతం అనే తేడా లేకుండా కలుపుకొని ముందుకు తీసుకుని పోతుంది బీఆర్ఎస్ ప్రభుత్వం. అందుకే మీరు మంచి పద్ధతుల్లో ఆలోచన చేసి ఓటేస్తే మంచి జరుగుతది. చందర్ గురించి మీకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఉద్యమకారుడు. ఉద్యమ కాలంలో 74 రోజులు జైల్లో ఉన్నాడు. ఆయన కూడా సింగరేణి కార్మికుడి కుమారుడు. కాబట్టి సింగరేణి గురించి బాగా అవగాహనం ఉంది. ఇక బొగ్గు, నీళ్లు ఉన్నాయి. రవాణా వసతి ఉంది. ట్రైన్ కూడా ఉంది. మాకు పరిశ్రమలు లేవు అని చందర్ చెప్పారు. రామగుండం నిర్లక్ష్యానికి గురైంది సమైక్య రాష్ట్రంలో. మనం ఇప్పుడు కుదుటపడ్డాం. ఈ ప్రాంతానికి రావాల్సిన పరిశ్రమల గురించి ఆలోచించి తీసుకువస్తాం. దాని కోసం నేను కృషి చేస్తాను' అని కేసీఆర్ హామీ ఇచ్చారు.



## మీ పతనం మొదలైంది... మీ క్షుద్ర రాజకీయాలకు కాలం చెల్లింది



హైదరాబాద్ (వాయిస్ టుడే): తెలంగాణ ప్రజలకు టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి బహిరంగ లేఖ రాశారు. బీజేపీ – బీఆర్ఎస్ కుమ్మక్కై కాంగ్రెస్ నేతల ఇళ్లపై ఐటీ, ఈడీ దాడులు చేయిస్తున్నాయని తెలిపారు. అత్యున్నత ప్రభుత్వ సంస్థలు, రాజ్యాంగ బద్ధ వ్యవస్థలను కూడా మోడీ, కేసీఆర్ రాజకీయ క్రీడలో పావులుగా మార్చేశారని విమర్శించారు. ఆ రెండు పార్టీలలో చేరిన వాళ్లు పవిత్రులు... ప్రతిపక్షంలో ప్రజల తరఫున కొట్లాడే వాళ్లు ద్రోహులా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రతిపక్షమే ఉండకూడదని... ప్రశ్నించే గొంతులే మిగలకూడదన్నట్లు వ్యవహరిస్తున్నారన్నారు. ఇది బీజేపీ – బీఆర్ఎస్ మధ్య కుదిరిన కామన్ మినిమమ్ ప్రోగ్రామ్ అని అన్నారు. కేవలం కాంగ్రెస్ నాయకులే టార్గెట్ గా ఈడీ, ఐటీ దాడులు ఎందుకు జరుగుతున్నాయని నిలదీశారు. వీటి వెనుక ఉన్న అదృశ్య హస్తాలు ఎవరివి అని అన్నరు. కాంగ్రెస్ నేతలను వేధించాలన్న ఆదేశాలు ఈడీ, ఐటీ సంస్థలకు ఎక్కడ నుంచి అందుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గడిచిన పదేళ్లలో మోడీ – షా ఆదేశాలు లేకుండా ఈడీ, ఐటీ సంస్థల్లో చీమచిటుక్కుమన్నది లేదన్నారు. కాంగ్రెస్ నేతల ఇళ్లపై జరుగుతోన్న దాడుల వెనుక ఎవరున్నారో తెలంగాణ సమాజం అర్థం చేసుకోవాలని టీపీసీసీ చీఫ్ తెలిపారు.

## బర్రెలక్కకు ఒక గన్‌మెన్‌తో భద్రత కల్పించాలని హైకోర్టు ఆదేశాలు




కొల్లాపూర్ ఇండిపెండెంట్ అభ్యర్థి బర్రెలక్కకు భద్రత పై హైకోర్టు సానుకూలంగా స్పందించింది. ఎన్నికలు పూర్తయ్యేవరకు ఆమెకు భద్రత కల్పించాలని హైకోర్టు అధికారులను ఆదేశించింది. బర్రెలక్కకు ఒక గన్‌మెన్‌తో భద్రత కల్పించాలని ఆదేశాలు జారీ చేసింది. గుర్తింపు ఉన్న పార్టీలకే భద్రత ఇస్తే సరిపోదని, త్రెట్ ఉందని అభ్యర్థించే అభ్యర్థులకూ భద్రత కల్పించాలని కోర్టు అభిప్రాయపడింది. అభ్యర్థుల భద్రత బాధ్యత ఎన్నికల కమిషన్‌దే అంటూ హైకోర్టు వ్యాఖ్యానించింది.



## తెలంగాణ బిచ్చమ్ వేశారట?.. అవమానపరిచేలా మాట్లాడితే ఖబడ్దార్..

కామారెడ్డి (వాయిస్ టుడే): లీడర్లను కొనవచ్చు కానీ తమ ప్రజల ఆత్మ గౌరవాన్ని కొనలేరని మంత్రి హరీష్‌రావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఎల్లారెడ్డిలో నిర్వహించిన రోడ్ షోలో మంత్రి మాట్లాడుతూ... రాహుల్, ప్రియాంకలు కర్ణాటకలో అయిదు హామీలు చెప్పారని.. అక్కడి ప్రజలు నమ్మి ఓటేశారన్నారు. వారు అధికారంలోకి వచ్చాక ఉన్న కరెంటు పోయిందన్నారు. వారి పరిస్థితి పెనం మీది నుండి పోయిల పడ్డట్టు అయిందని తెలిపారు. వైఎస్ పీరియడ్లో ఉచిత కరెంటు అని ఉత్త కరెంటు చేసిండ్రని వ్యాఖ్యలు చేశారు. "కరెంటు కావాలా.. కాంగ్రెస్ కావాలా? కరెంటు కావాలంటే కారుకు ఓటు వేయండి. కేసీఆర్ ఇంత మంచిగ చేయంగా కాంగ్రెస్ వాళ్ళను నమ్ముడు ఎందుకు.. రిస్కుల పడుడు ఎందుకు?" అని ప్రశ్నించారు. గత ప్రభుత్వాలు రైతుల దగ్గర డబ్బులు వసూలు చేశారని.. రైతులకు తిరిగి డబ్బులు ఇచ్చింది ఒకే ఒక్కడు కేసీఆర్ అని చెప్పుకొచ్చారు. తమ పథకాలు కాంగ్రెస్ వాళ్లు నకల్ కొట్టారు కానీ ఆఖల్ లేదన్నారు. కేసీఆర్ ఎకరాకు రూ.16 వేలు ఇస్తా అంటే కాంగ్రెస్ వాళ్లు రైతుకు రూ.15వేలు అంటున్నారన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం



అలంపూర్ సిట్టింగ్ ఎమ్మెల్యే అబ్రహం కాంగ్రెస్ గూటికి చేరుకున్నారు. టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. అందరికంటేముందు బీఆర్ఎస్ నుంచి జంబో లిస్ట్ ప్రకటించిన కేసీఆర్.. అలంపూర్ నుంచి అబ్రహంను అభ్యర్థిగా ప్రకటించారు. కానీ.. బీ– ఫామ్ మాత్రం ఇవ్వలేదు. అభ్యర్థిగా ప్రకటించి.. బీ–ఫామ్ ఇవ్వకపోవడంతో... అసంతృప్తికి లోనైన అబ్రహం.. కాంగ్రెస్ లోకి వెళ్లినట్టు తెలుస్తుంది.

## ఆర్మూర్ సభలో కేసీఆర్, కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డ అమిత్ షా

నిజామాబాద్ (వాయిస్ టుడే): ఇచ్చిన ఒక్క మాట, హామీని కేసీఆర్ నెరవేర్చలేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా విమర్శలు గుప్పించారు. శుక్రవారం ఆర్మూర్ సభలో అమిత్ షా మాట్లాడుతూ.. టర్మరిక్ బోర్డు ఇచ్చింది బీజేపీ అని చెప్పుకొచ్చారు. నిజామాబాద్ జిల్లాలో బీడీ వర్కర్స్ కోసం ప్రత్యేక హాస్పిటల్, ఉత్తర తెలంగాణ నుంచి వెళ్లిన గల్ఫ్ బాధితుల కోసం ఎన్ఆర్ఐ పాలసీ ఇచ్చామన్నారు. బీజేపీ సర్కార్‌లో హైదరాబాద్ విమోచన దినం జరుపుతామని వెల్లడించారు. దళిత ముఖ్యమంత్రి అని చెప్పి కేసీఆర్ మాట తప్పారన్నారు. బీజేపీ బీసీ ముఖ్యమంత్రి హామీని నిలబెట్టుకుంటామని స్పష్టం చేశారు. జీఎస్టీ మార్పులు తీసుకువస్తామని.. ఏడాదిలో నాలుగు గ్యాస్ సిలిండర్ ఉచితంగా అందిస్తామన్నారు. డబ్బులు ఎక్కువగా ఎవరు ఇస్తే కేసీఆర్ మంత్రి వర్గంలో వారే ఉంటారని తెలిపారు. అవినీతి కేసీఆర్‌ను గద్దె దింపాల్సిన అవసరం ఉందన్నారు. యువతకు ఉద్యోగాలు కల్పించి, పేపర్ లికేజి ఘటనపై విచారణ జరిపి జైల్‌కు పంపుతామని స్పష్టం చేశారు. కేసీఆర్ కార్ స్టీరింగ్ ఓవైసీ చేతిలో ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీతో సుపరిపాలన సాధ్యం కాదని అన్నారు. కాంగ్రెస్‌లో కేవలం మంత్రి పదవి పొందాలంటే ఢిల్లీలో చర్చించాలి అని.. అలాంటి పార్టీ అవసరమా అని అమిత్ షా ప్రశ్నించారు.



వాయిస్ టుడే
హైదరాబాద్
శుక్రవారం, 24 నవంబరు, 2023



# కేసీఆర్, బీజేపీ సర్కారుపై ప్రియాంక గాంధీ ఫైర్

సిద్దిపేట (వాయిస్ టుడే): హుస్నాబాద్ కాంగ్రెస్ విజయ భేరి సభలో ప్రియాంక గాంధీ మాట్లాడుతూ కేసీఆర్ సర్కారుపై విమర్శలు గుప్పించారు. ప్రాజెక్టులు అవినీతి మయంగా మారిపోయాయని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ కుటుంబ సభ్యులకు మాత్రమే మంత్రి పదవులు ఇచ్చారని విమర్శించారు. తెలంగాణ ఎన్నికలు కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య జరుగుతున్నాయని తెలిపారు. కష్టపడి చదివితే పేపర్ లీకులు చేస్తున్నారని విమర్శించారు. ఢిల్లీలో బీజేపీ బీఆర్ఎస్ మద్దతు ఇస్తే, తెలంగాణ బీఆర్ఎస్‌కు బీజేపీ మద్దతు ఇస్తోందని ప్రియాంక గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు



# రేపు హైదరాబాద్‌లో కేసీఆర్ సభ రద్దు..!

హైదరాబాద్ (వాయిస్ టుడే): రేపు (25-11-2023) హైదరాబాద్‌లో జరగాల్సిన సీఎం కేసీఆర్ సభ రద్దైనట్లు సమాచారం. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన సభను బీఆర్ఎస్ అధిష్టానం క్యాన్సిల్ చేసినట్లు తెలుస్తోంది. రెండు రోజుల పాటు వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో సభను రద్దు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. పార్టీ హైకమాండ్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్నికల ప్రచారం ఉధృతంగా సాగుతోంది. ముఖ్య నేతలంతా ఆయా నియోజకవర్గాల్లో సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. విమర్శలు.. ప్రతి విమర్శలతో నేతలు ప్రచారాన్ని హీటెక్కిస్తున్నారు. మరో నాలుగు రోజులే ప్రచారం మిగిలి ఉండడంతో ఉదయం నుంచే నేతలంతా ప్రచారంలో మునిగి తేలుతున్నారు.



# రేవంత్ రెడ్డి ఎవరు.. అవినీతిపరుడు కాదా?

హైదరాబాద్: తెలంగాణభవన్‌లో ఆటో యూనియర్ కార్మికుల ఆత్మీయ సమ్మేళనంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2014 నుంచి తెలంగాణలో మార్పు వచ్చిందా లేదా? అని ప్రశ్నించారు. అప్పుడున్న భూమి ధరలు ఇప్పుడున్న భూమి ధరలు ఒక్కసారి గమనించాలన్నారు. రైతులకు ఒక్క పైసా ఇవ్వని పార్టీలు ఇప్పుడు నీతలు చెబుతున్నారని విమర్శించారు. విద్యార్థుల చదువుల కోసం ఖర్చు పెడుతున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని చెప్పుకొచ్చారు. నిజంగా నిరుద్యోగులు అంటే కాంగ్రెస్ నేతలు మాత్రమే అని.. వాళ్ళు పదవుల కోసం రాజకీయ నిరుద్యోగులని ఎద్దేవా చేశారు. ఉదయ్‌పూర్ డిక్లరేషన్ అంటూ ఒక్క ఇంటికి ఒక సీటే అన్నారని.. కానీ ఇంటికి ఇద్దరు అభ్యర్థులు పోటీ చేస్తున్నారని తెలిపారు. "రేవంత్ రెడ్డి ఎవరు అవినీతిపరుడు కాదా? నోట్ల కట్టలతో దొరకిన చిల్లరగాడు రేవంత్ రెడ్డి. వాడు కూడా నీతులు చెప్తున్నాడు" అంటూ విరుచుకుపడ్డారు. ఆటో యూనియన్‌లను ఆదుకున్నది కేసీఆర్ మాత్రమే అని అన్నారు. రూ.100 కోట్లతో ఆటో కార్మికులను ఆదుకున్నారని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేది లేదు సచ్చేది లేదన్నారు. ఓట్ల కోసం కాంగ్రెస్ నేతలు సర్కస్ ఫీట్లు చేస్తున్నారన్నారు. మెదక్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఒకడు 48 గంటల కరెంట్ ఇస్తా అని అంటున్నారని... మనకు ఉన్నదే 24 గంటలు, కానీ 48 గంటల కరెంట్ ఎట్లా ఉంటదని ప్రశ్నించారు.

# టీఆర్ఎస్.. బీఆర్ఎస్‌గా మారింది.. కానీ బుద్దే మారలేదు..



భద్రాద్రి కొత్తగూడెం (వాయిస్ టుడే): తెలంగాణలో బీఆర్ఎస్‌కు వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని ఏపీ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. శుక్రవారం కొత్తగూడెం సీపీఐ అభ్యర్థి కూనంనేనికి మద్దతుగా రామకృష్ణ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ అహంకారానికి వ్యతిరేకంగా ప్రజలు తీర్పు ఇస్తారని తెలిపారు. పోరాటాల గడ్డ తెలంగాణ అని అన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్ట్‌పై మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలు అహంకారంగా ఉన్నాయన్నారు. టీఆర్ఎస్ పార్టీ పేరు బీఆర్ఎస్‌గా మారింది కానీ బుద్ధి మారలేదని వ్యాఖ్యలు చేశారు.

కేసీఆర్ అతి తెలివితో డబ్బు మదంతో వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. మోదీ, కేసీఆర్, జగన్ ముగ్గురు ఒక్కటే అని అన్నారు. అహంకారంతో ముగ్గురు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్‌లో స్థిరపడ్డ సీమాంధ్ర ప్రజలు బీజేపీ, బీఆర్ఎస్‌ను చిత్తు చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో బీజేపీతో పొత్తుపై పవన్ కళ్యాణ్ త్వరలో కళ్లు తెరుస్తారన్నారు. తెలంగాణ ఎన్నికల్లో పోటీ చేయకుండా చంద్రబాబు మంచి నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. పవన్ కళ్యాణ్ కూడా తెలంగాణలో పోటీ చేయకుండా ఉండాల్సిందని రామకృష్ణ అభిప్రాయపడ్డారు.

# బర్రెలక్కను చూసి బీఆర్ఎస్ సర్కార్ భయపడుతోంది...



ఖమ్మం (వాయిస్ టుడే): సీపీఎం, సీపీఐ లిస్ట్‌కు కాంట్రవర్సీ లేదని సీపీఐ నేత నారాయణ స్పష్టం చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. ఇండియా కూటమిలో తాము భాగస్వాములమన్నారు. ప్రియాంకగాంధీ సభలో పాల్గొంటున్నట్లు చెప్పారు. ఇవాళ జాతీయ నాయకులు టి.రాజా ఖమ్మం వస్తున్నారన్నారు. కాంగ్రెస్ వాళ్ళు చాలా ముదుర్లని.. ఐదు సీట్లు అడిగితే తమకు ఒక్క సీటే కేటాయించారని తెలిపారు. వివేక్ గద్దలా తమకు కేటాయించాల్సిన సీటు ఎత్తుకుపోయారని విమర్శించారు. రాజాసింగ్ కరుడుగట్టిని హిందుత్వవాదన్నారు. బీజేపీని, మోదీని తూలనాడిన కేసీఆర్ ఇప్పుడు ఎందుకు ఇలా ప్రవర్తిస్తున్నారని ప్రశ్నించారు. తాము మునుగోడు ఎన్నికల్లో బీఆర్ఎస్‌తో కలిసి ఎన్నికలకు వెళ్ళామని చెప్పారు. ఉత్తరప్రదేశ్ వరకు బీజేపీ బలంగా ఉందని.. ఇప్పుడు జరిగే ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీ ఓడిపోతుందని తెలిపారు.

# కించపరిచేలా మాట్లాడిన ఖుష్బూ క్షమాపణ చెప్పాల్సిందే...



ప్యారీస్(చెన్నై): షెడ్యూల్ తెగలకు చెందిన ప్రజలను కించపరిచేలా మాట్లాడిన సినీ నటి, జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు ఖుష్బూ తక్షణం క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ పార్టీ తమిళనాడు శాఖ ఎస్సీ విభాగ అధ్యక్షుడు ఎంపీ రంజన్ కుమార్ డిమాండ్ చేశారు. ఇదే విషయంపై ఆయన గురువారం స్థానిక రాయపేటలోని టీఎన్‌సీసీ ప్రధాన కార్యాలయమైన సత్యమూర్తిభవన్‌లో మాట్లాడుతూ... గత కొన్ని రోజుల క్రితం నటుడు మన్సూర్ అలీఖాన్ అసభ్య పదజాలంతో నటి త్రిషను విమర్శించారని, ఆయన వ్యాఖ్యలను ఖండించే క్రమంలో ఖుష్బూ.. షెడ్యూల్ తెగల ప్రజలు మాట్లాడే విధంగా మన్సూర్ అలీఖాన్ మాట్లాడారని ఇది ఏమాత్రం సరైన పోలిక కాదన్నారు. ఖుష్బూ వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన రంజన్ కుమార్ షెడ్యూల్ తెగల ప్రజలకు ఆమె భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సోషల్ మీడియా వేదికగా ఆమె రెండు రోజుల్లో క్షమాపణ చెప్పకుంటే కాంగ్రెస్ పార్టీ తరపున రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో లక్షలాది మంది దళితులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



# బండి సంజయ్ దుర్మార్గుడు, అత్యంత అవినీతిపరుడు: మంత్రి గంగుల ఫైర్

కరీంనగర్: దుర్మార్గుడు, అవినీతిపరుడు బండి సంజయ్ అని, తనకున్న అధికారాన్ని దుర్వినియోగం చేసి తన కుటుంబాన్ని వేధించాడని కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ ఫైర్ అయ్యారు. శుక్రవారం కరీంనగర్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. గతంలో తన కుటుంబం ఊర్లో లేనప్పుడు తన ఇంటిపై దాడి చేసి, తాళాలు పగలగొట్టి దౌర్జన్యం చేశాడన్నారు. కేంద్ర ప్రభుత్వం తన చేతిలో ఉందని సీబీఐ, ఈడీ, ఐటీ ఉందని అహంకారంతో దాడి చేయించారని ఆరోపించారు. బండి లాంటి దుర్మార్గునికి, అవినీతి పరునికి ఓటేద్దామా అని ప్రశ్నించారు.బండి సంజయ్ లాంటి వ్యక్తులు ఎన్ని కుయుక్తులు పన్నినా..తనను కడుపులో పెట్టుకొని కాపాడుతున్న కరీంనగర్ ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. ఈ ఎన్నికల్లో కారుగుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. మరింతగా కరీంనగర్ అభివృద్ధి చేసి ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు.

# మానవతా దృక్పథంతో పనిచేస్తున్న ప్రభుత్వాన్ని మరోసారి దీవించండి: ఎమ్మెల్సీ కవిత



నిజామాబాద్ (వాయిస్ టుడే): వచ్చే ఐదేళ్లలో పేదల సొంతింటి కలను తాము నిజం చేస్తామని ఎమ్మెల్సీ కవిత అన్నారు. నిజామాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి గణేష్ గుప్తా తరఫున నాగారంలో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. 60 ఏళ్లు పరిపాలించిన కాంగ్రెస్ పార్టీ నిరుపేదలకు చేసింది ఏమీ లేదన్నారు. తెలంగాణ రాక ముందు ఈ నగరంలో దయనీయ పరిస్థితి ఉండేది. ఇప్పుడు అన్ని సౌకర్యాలు కల్పించాం. ఈ కాలనీని దత్తత తీసుకుని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. త్వరలో కొత్త రేషన్ కార్డులు ఇప్పిస్తామని చెప్పారు.బీఆర్ఎస్ కొత్త మ్యానిఫెస్టోలో ఉన్న అంశాలు పేదలకు ఎంతో ఉపయోగపడతాయి. కేసీఆర్ ఏది చెప్పినా అది చేసి చూపెడతారు. కాంగ్రెస్ పాలనలో కేవలం ఒక్కటే మైనారిటీ పాఠశాల ఉండేది. ఇప్పుడు జిల్లాలో 23 మైనార్టీ పాఠశాలలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. మానవతా దృక్పథంతో పనిచేస్తున్న ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నాను. గడిచిన 10 ఏళ్లలో తెలంగాణలో ఎక్కడ కూడా మత ఘర్షణలు జరగలేదన్నారు. రానున్న ఐదేళ్లలో పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు చర్యలు తీసుకుంటాం. నిజామాబాద్ ఐటీ హబ్?లో 3200 ఉద్యోగాలు కల్పించాం. రానున్న ప్రభుత్వంలో విద్య, వైద్యం మరింత మెరుగు పరుస్తాం. కొత్త బీడీ కార్మికులకు పెన్షన్ ఇస్తామని కవిత హామీ ఇచ్చారు.

# కరీంనగర్ ఐటీ టవర్‌లో తొండలు గుడ్లు పెడుతున్నాయి: బండి సంజయ్



కరీంనగర్ ఐటీ టవర్ లో తొండలు గుడ్లు పెడుతున్నాయని బీజేపీ ఎంపీ, కరీంనగర్ ఎమ్మెల్యే అభ్యర్థి బండి సంజయ్ ఎద్దేవా చేశారు.బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఎకరానికి రూ.24 వేలు అందిస్తామని చెప్పారు. రైతు పక్షపాతి ఎవరో.. ఎన్నికల సమయంలో మీరే ఆలోచించి.. ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. బీజేపీ అధికారంలోకి వస్తే వరి కనీస మద్దతు ధర రూ.3100 చేస్తామని స్పష్టం చేశారు. మహిళలకు ఉచితంగా 4 గ్యాస్ సిలిండర్లు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఒక్క కొత్త కంపెనీని కూడా తీసుకురాలేని దద్దమ్మ గంగుల అని విమర్శించారు. కరీంనగర్ లో బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులకు భూకబ్జాల చరిత్ర ఉందన్నారు. ఎన్నికలు అయిపోగానే బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఒక్కటై కేసులు సెటిల్ చేసుకుంటారని చెప్పారు. కానీ తనపై ఉన్న కేసుల పరిస్థితి ఏంటని అడిగారు. వీడు పోలీస్ ఇన్స్ పెక్టర్ కు మూడు నామాలు, బ్యాంకు ఖాతా జీరో, లక్షల్లో లూటీ ! తనది ప్రజల పక్షాన పోరాటాల చరిత్రని గుర్తు చేశారు. ఆస్తులు సంపాదించినట్లు రుజువు చేస్తే.. అవన్నీ ప్రజలకు రాసిస్తానని బండి సంజయ్ తేల్చి చెప్పారు. ప్రవాస భారతీయుల కోసం బీజేపీ కొట్లాడుతుదని.. కాబట్టి తమకు ఓటేయాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. రేషన్ బియ్యం కేంద్రమే అందిస్తుందని స్పష్ట చేశారు. ఐకేపీ కేంద్రాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల నుండి కొనే వడ్ల పైసలన్నీ కేంద్రమే చెల్లిస్తోందని బండి సంజయ్ గుర్తు చేశారు. వడ్లను సేకరించినందుకుగాను కేసీఆర్ ప్రభుత్వానికి బ్రోకరేజీ రూపంలో కమీషన్ కూడా కేంద్రమే చెల్లిస్తుందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు కరీంనగర్ ప్రజలకు ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా ఇవ్వలేదన్నారు. బీసీ మంత్రిగా ఉంటూ బీసీలకు బీసీ బంధు పైసలియ్యలేదని దుయ్యబట్టారు. పేపర్ లీకేజ్ వల్ల తెలంగాణలో ఎంతోమంది విద్యార్థులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగులకు మద్దతుగా తాను ధర్నా చేస్తే తనను జైలుకు పంపారని గుర్తు చేశారు.

# బీఆర్ఎస్ అంబాసిడర్ కారు మ్యూజియంలో ఉండాల్సిన రోజు వచ్చింది

హైదరాబాద్ (వాయిస్ టుడే): గత కొన్ని నెలల క్రితం తెలంగాణలో రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర సాగిందని.. భారత్ జోడో యాత్ర తర్వాత తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతుందని అర్థమైందని అఖిలభారత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జయరాం రమేష్ అన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో రైతులు, నిరుద్యోగులు, ఉద్యోగులు కాంగ్రెస్ పార్టీ వైపే ఉన్నారన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్‌కు బీ టీమ్ బీజేపీ, సీ టీమ్ ఎంఐఎం అని వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ బిల్లు ప్రవేశపెట్టినప్పుడు పార్లమెంట్‌లో ఒక టీఆర్ఎస్ ఎంపీ లేరని.. రాజ్యసభలోనూ లేరని తెలిపారు. అలాంటి తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీని తెలంగాణ ద్రోహి అంటున్నాడు కేసీఆర్ అని మండిపడ్డారు. కేటీఆర్ మాట్లాడుతూ బ్రాండ్ తెలంగాణ తయారు చేశానంటున్నారని.. హైదరాబాదులో అనేక రకాల పరిశ్రమలను ఐటీ రంగాన్ని తీసుకొచ్చింది కాంగ్రెస్ పార్టీ



అని చెప్పుకొచ్చారు.

తెలంగాణ ఏర్పడడానికి రెండో కారణం ఉద్యోగాలు అని అన్నారు. కానీ తెలంగాణలో పబ్లిక్ కమిషన్ ద్వారా ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నోటిఫికేషన్లు పరీక్షలకే పరిమితమైందన్నారు. తెలంగాణలో నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. తెలంగాణలో కుటుంబ పాలన నడుస్తుందని.. కానీ ముఖ్యమంత్రి, ముఖ్యమంత్రి కొడుకు, ముఖ్యమంత్రి కుమార్తె , ముఖ్యమంత్రి మేనల్లుడు పదవులు అన్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత కేసీఆర్ కుటుంబానికి న్యాయం జరిగిందని.. కానీ పేదలకు, దళితులకు ఏం జరగలేదని వ్యాఖ్యలు చేశారు. 30 తర్వాత బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎంకు బై బై చెప్పడానికి ప్రజల సిద్ధంగా ఉన్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీ గుర్తు కారు, ఆ కారు అంబాసిడర్ కారు, అది మ్యూజియంలో ఉండాల్సిన రోజు వచ్చిందంటూ ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పార్టీ ప్రకటించిన గ్యారెంటీలకు, 30 తర్వాత ఎక్స్పైరీ డేట్ అయిపోతుంది అంటూ జయరాం రమేష్ వ్యాఖ్యలు చేశారు.